క్లుప్తంగా

నిరాశ్రయ వసతి గృహానికి వృద్ధుడి తరలింపు



షెల్టర్ హోంలో వృద్ధుడితో హెడ్ కానిస్టేబుల్ గోపీనాథ్, ప్రగడ వాసు

సీతమ్మధార: అల్లరి మూకల నుంచి ఒక వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు రక్షించారు. సుమారు 70 సంవత్సరాల వయసు గల వృద్ధుడు రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్ మీద ఉంటున్నాడు. కొంత మంది అయనను హింసిస్తున్న సమయంలో ఫోర్తుటౌన్ హెడ్ కానిస్టేబుల్ గోపీనాథ్ గమనించారు. అల్లరిమూకల్ని తరిమికొట్టి వృద్ధుడిని టీఎస్ఆర్ కాంప్లెక్స్ షెల్టర్‌కు తీసుకెళ్లారు. షెల్టర్ ఆ వృద్ధుడికి ఆశ్రయం కల్పించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వృద్ధుడు తన ఊరు, పేరు తదితర వివరాలు ఏమీ తెలియజేయలేదని వాసు చెప్పారు.

నేడు ఈస్టర్ వేడుకలు


ప్రత్యేక ప్రార్థనలు జరగనున్న రక్షణ గిరి ముఖద్వారం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా (ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. లోకరక్షకుడు క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. పారిస్ పాస్టిల్ కౌన్సిల్ సభ్యులు ఉత్సవానికి నేతృత్వం వహిస్తారని ఆయన తెలిపారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నియంత్రణ


మాట్లాడుతున్న రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి

మురళీనగర్: నిరంతరం అప్రమత్తంగా ఉన్నప్పుడే అగ్నిప్రమాదాలను సకాలంలో నియంత్రించవచ్చని విశాఖ జోన్–1 రీజినల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో పరిశ్రమలు, పారిశ్రామిక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రమాదాలను ముందుగానే పసిగట్టాలన్నారు. అనుకోని సందర్భంలో ప్రమాదం జరిగినప్పుడు సమీపంలోని అగ్నిమాపక కేంద్రం అధికారులకు ఫోన్ ద్వారా సమాచారమందిస్తే ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించవచ్చని చెప్పారు. ఫైర్ సేఫ్టీ పరికరాల వినియోగంలో సిబ్బంది సమయోచితంగా వ్యవహరించాలని సూచించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సేఫ్టీ, ఫైర్ ప్రివెన్షన్ పై సేఫ్టీ కన్సల్టెంట్ జయంతి లచ్చయ్య అవగాహన కల్పించారు. సేఫ్టీ కోర్సుల విభాగం సిబ్బంది, సేఫ్టీ కోర్సు విద్యార్థులు, నాగపూర్ నేషనల్ ఫైర్ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 10.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జె.కె.మీనాలు తమ సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేశారు. బిహార్ రాష్ట్రం సారన్ జిల్లాకు చెందిన బహారస్ కుమార్ విశాఖ మీదుగా గుజరాత్ జామ్ నగర్కు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రూ.52,500 విలువైన 10.5 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నాడు వైభవం.. నేడు శిథిలం


మండపంలో విరిగిపోయిన తలుపులు, కిటికీలు


మండపంలో చెత్తాచెదారం


పాడైన వాష్ బేసిన్


శిలాఫలకం


తాళం వేసి ఉన్న కల్యాణ మండపం

- దయనీయ స్థితిలో నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం
- వెనుకటి రోజుల్లో శుభకార్యాలతో కళకళ
- ఎలాంటి కార్యకలాపాలు లేక నేడు వెలవెల


నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం


బీటలు వారి మురికిగా తయారైన కల్యాణ మండపం గోడలు

సీతమ్మధార: నక్కవానిపాలెంలో ఉన్న వివేకానంద కల్యాణ మండపం సభలు, సమావేశాలు, వివాహాలతో కళకళలాడేది. జీవీఎంసీకి చెందిన ఈ కల్యాణ మండపం కాంట్రాక్ట్ కాలపరిమితి గత ఏడాది ముగియడంతో జోన్–3 రెవెన్యూ అధికారులు దీన్ని స్వాధీనం చేసుకున్నారు. మరమ్మతులు చేస్తామని చెప్పినా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. అప్పటి నుంచి ఇక్కడ శుభకార్యాలు జరగడంలేదు. గత మేయర్ డీవీ సుబ్బారావు హయాంలో నిర్మించిన ఈ కల్యాణ మండపాన్ని 1990లో అప్పటి రాష్ట్ర రెవెన్యూ మంత్రి డీకే సమరసింహారెడ్డి ప్రారంభించారు. టెండర్లు పిలవడం ద్వారా కాంట్రాక్టర్లు ఈ కల్యాణ మండపం నిర్వహిస్తున్నారు. సీతమ్మధార, గాంధీనగర్, నక్కవానిపాలెం, టీపీటీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల ప్రజలు శుభకార్యాలు, సభలు, సమావేశాల కోసం ఈ కల్యాణ మండపాన్ని ఆశ్రయిస్తుంటారు. పలు రాజకీయ సమావేశాలు కూడా ఇక్కడ జరుగుతుంటాయి. ప్రస్తుతం ఎటువంటి ఫంక్షన్లు చేద్దామన్నా ఈ కల్యాణ మండపం అందుబాటులో లేక దూరంగా ఉన్న ఫంక్షన్ హాళ్లకు వెళ్లాల్సి వస్తుందని చుట్టుపక్కల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయనందునే ఈ కల్యాణ మండపం కొంత వరకు శిథిలావస్థకు చేరుకుందని అంటున్నారు. మండపం మరమ్మతులు చేయాలంటే సుమారు కోటిన్నర దాటుతుందని అంచనా.

జోరుగా అసాంఘిక కార్యకలాపాలు..

కొంతకాలంగా వినియోగంలో లేని కల్యామండపం వద్ద కనీసం సెక్యూరిటీ గార్డు కూడా లేడు. మండపానికి తాళం కూడా లేదు. ఫలితంగా చుట్టుపక్కల ఆకతాయి యువకులు ఇక్కడ జూదం, మద్యపానం చేస్తూ మండపాన్ని మరుగుదొడ్డిగా మార్చేసారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. జోన్–3 అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్యాణ మండపం లోపల అంతా చిందరవందర గా ఉంది. ఈ మండపాన్ని స్వాధీనం చేసుకున్నామన్న విషయం అధికారులు మరిచిపోయారేమో అని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి

నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి. గతంలో ఇక్కడ కల్యాణాలు జరిగాయి. పాడైన తర్వాత ఎవరూ పట్టించుకోక మురుగుదొడ్డిగా తయారు చేశారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మండపానికి పూర్వ వైభవం తీసుకురావాలి. – ఎస్.నర్సింహారావు

శుభకార్యాలు చేసుకోలేకపోతున్నాం

వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతు చేసి పేదలకు అందుబాటులోకి తేవాలి. ఇది శిథిలం కావడం వల్ల చుట్టుపక్కల ప్రజలు శుభ కార్యాలు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ కమిషనర్, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – మజ్జి ఉమామహేశ్వరరెడ్డి, 24వ వార్డు, రేసపువానిపాలెం.

కల్యాణ మండపం పూర్తి చేయాలి

రెండేళ్ల కిందట జీవీఎంసీ కౌన్సిల్‌లో కల్యాణ మండపంపై చర్చించాను. నూతన భవనానికి మూడు ఫ్లోర్ల కోసం రూ.2 కోట్లు మంజూరు చేయాలని గతంలో కమిషనర్, మేయర్‌ను కోరాను. కల్యాణ మండపం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. – సాడి పద్మారెడ్డి, 24వ వార్డు కార్పొరేటర్

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ


భక్తులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న అర్చకుడు శేషాచార్యులు, ఈవో ప్రసాద్

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్ర భాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యు లు ఆధ్వర్యంలో ఉయదం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో అర్చకుడు శేషాచార్యులు, ఈవో ప్రసాద్ స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం


కేక్ కట్‌చేస్తున్న ఎంఈవో బాలామణి తదితరులు

సీతంపేట: అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు రామారావు, బాలామణి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆశాదేవి, సీఆర్పీలు బేగం, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర'తో పరిసరాలు పరిశుభ్రం


ర్యాలీలో పాల్గొన్న నాగభూషణం, రాజు, విద్యార్థులు


స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న జెడ్సీ శివప్రసాద్ తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం దరి ప్రియదర్శిని కాలనీలోని సామాజిక భవనంలో శనివారం స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర (ఈ–వేస్ట్) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి జోన్–3 కమిషనర్ పి.శివప్రసాద్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ సామాన్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఏ విధంగా నిర్మూలించాలో తెలియజేస్తూ ఎలక్ట్రానిక్ షాపుల యాజమానులు, టీవీ మెకానిక్‌లు, స్క్రాప్ షాపుల వారికి, ప్రజలకు అవగాహన కల్పించారు. తడి–పొడి, ప్రమాదకర చెత్తను విభజిస్తూ పాడైన ఎలక్ట్రానిక్ సామాన్లు ఆర్ఆర్ఆర్ సెంటర్లకు అందజేయాలని తెలిపారు. అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఎస్ఎస్ సత్యనారాయణ, సీవో ఇంద్ర, శానిటేషన్ సెక్రటరీలు, అడ్మిన్లు, ఆర్పీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ–వేస్ట్, టేబుళ్లు, కంప్యూటర్లు, రికార్డులు, విండో డోర్లు, పనికిరాని వస్తువులను విభజించి, వాటిని జీవీఎంసీకి పంపించే ఏరాట్లు చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని డీఎంహెచ్‌వో సూచించారు. జగదీశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది తమ సెక్షన్లు, పరిసరాలను శుభ్రం చేశారు.

అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. 33వ వార్డులోని నీలమ్మ వేపచెట్టు, బంగారుమెట్ట ప్రాంతాల గుండా అల్లిపురం శాఖా గ్రంథాలయానికి చేరుకుంది. అక్కడ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది గ్రంథాలయాన్ని శుభ్రపరిచారు. పుస్తకాలను రేక్‌లలో సర్ది చక్కగా అలంకరించారు.

పారిశుధ్య పనులు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వరాదు



జోన్-5 జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు


జోనల్ కమిషనర్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కంచరపాలెం: మున్సిపల్ కార్మికుల్ని, పారిశుధ్య బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద శనివారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.నూకరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల కార్మికులందరూ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీల దగ్గర కూటమి ప్రభుత్వ నేతలు వేల కోట్లు కమీషన్లుగా తీసుకున్నారని, అందుకే మున్సిపల్ కార్మికుల బతుకులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పేందుకు చూస్తున్నారని ఆరోపించారు. 20 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం అయితే మున్సిపల్ కార్మికులను ప్రైవేటుపరం చేసే ప్రయత్నం చేసిందో ఆ ప్రభుత్వాల సంగతి తేలేదాకా కార్మికులు నిద్రపోలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వాని కి కూడా అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు, రాష్ట్ర ప్రజల కన్నా ప్రైవేటు పెట్టుబడిదారులే చంద్రబాబు ప్రభుత్వానికి ఎక్కువైపోయారని అన్నారు. ఆప్కాసులో ఉన్న పొరపాట్లని సరిచేసి ఎంత మెరుగైన వ్యవస్థను తీసుకొచ్చినా ఫర్వాలేదని, లేదంటే ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ ప్రైవేటీకరణ విధానాలను బద్దలుకొట్టే వరకూ ఈ పోరాటాన్ని కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం జోనల్ కమిషనర్ బి.రాముని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, వి.మహేశ్వరి, సీతాలక్ష్మి, అప్పలరాజు, పి.రాజు, ఎం.సత్యవతి, బాలరాజు, శివమణి, ధనలక్ష్మి, నూక రాజు, కొండమ్మ, కనక రాజు, సత్యవతి, కన్నతల్లి, కేధారి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ


శాంతి ర్యాలీలో పాల్గొన్న జ్ఞానాపురం క్యాథలిక్ క్రైస్తవ నాయకులు

కంచరపాలెం: ఏసుక్రీస్తు జనన, మరణ పునరుత్థానాన్ని చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద విశాఖ ఆర్‌సీఎం ఆర్చిడయోసిస్, ఆలిండియా క్యాథలిక్ యూనియన్, ఆల్ చర్చెస్, ఫెలోషిప్స్, డినామినేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్ దీనికి నేతృత్వం వహించారు. జ్ఞానాపురం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ర్యాలీని సెయింట్ పీటర్స్ చర్చి వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో బూర రవీంద్ర శేషుబాబు, బేథా జోసెఫ్, గోన స్వామినాథం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న గాయని కృష్ణ శృతి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో శనివారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ అలరించింది. గాయని ఇవటూరి కృష్ణ శృతి తన మధురమైన గానంతో ప్రేక్షకులను కట్టిపడేశారు. త్యాగరాజ, అన్నమయ్య కీర్తనలు, పలు భక్తి గీతాలు ఆలపించి రంజింపజేశారు. వీటిలో శ్రీవిఘ్న రాజం భజే, బాల కనకమయ, గౌరీ సుకుమారి, శ్రీ దందుర్గే, తల్లి నిను, తంబురి మీటిదేవ, రామచంద్రుడితడు కీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈమెకు కె.గాయత్రి వరేణ్య వయోలిన్‌పై, పీవీఎస్ బాలాజీ యువరాజ్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని శృతిని సత్కరించారు.

ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల హత్యాకాండ


మాట్లాడుతున్న సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి

సీతంపేట: ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మావోయిస్టులు, ఆదివాసీల హత్యలను నిలిపివేయాలని సామాజిక ఉద్యమకారిణి సోనిసోరి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పౌర హక్కుల నేత ప్రొఫెసర్ కె.పి.సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసీలు, పిల్లలు, మహిళలు అనే తేడా లేకుండా హత్య చేస్తున్నారని ఆరోపించారు. బస్తర్‌లో ఆదివాసీలకు రక్షణ లేదని, నిత్యం ప్రాణభయంతో బతుకుతున్నారని, అక్కడ ఆదివాసీలు బతకాలంటే పోలీసుల ఎదుట లొంగిపోయామని చెప్పాలని, లేదంటే చంపేస్తామంటున్నారన్నారు. ఆదివాసీలు సాగిచేస్తున్న అడవులు, పొలాలు, కొండల్లో విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, ఈ సంపదను అతి చౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికి మారణకాండ కొనసాగిస్తున్నారని విమర్శించారు. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూ హక్కుల కోసం సుబ్బారావు ఉద్యమించారని కొనియాడారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ నాయకులు జె.వి,సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, చిలుకా చంద్రశేఖర్, కె.లలిత, కె.పద్మ, కె.చిన్నారావు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, విరసం నాయకుడు బూసి వెంకటరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


మాట్లాడుతున్న సీపీ బాగ్చి. చిత్రంలో డాక్టర్ సీతా మాణిక్యం

మహారాణిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు జి.రాఘవయ్య, వి.రాజ్యలక్ష్మి, ఎ.పద్మావతి, ఎస్.బి.చంద్రకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న స్మారక స్థూపం ఏర్పాటు చేయాలి


గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న తోట వాసుదేవరావు తదితరులు

దాబాగార్డెన్స్: విశాఖలో గౌతు లచ్చన్న స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు డిమాండ్ చేశారు. గౌతులచ్చన్న 19వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జడ్జి కోర్టు సమీపాన గల గౌతు లచ్చన్న విగ్రహానికి ఆయనతో పాటు బంటుపల్లి కృష్ణారావు, యాగంటి రవి, మడ్డి ప్రసాదు, బొంగు రాజారావు, బెహర శోభన్‌బాబు, లొట్టి వెంకట రమణ, దొంకాన రమేష్ తదితర బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు లచ్చన్న చేసిన సేవలు ఎనలేనివన్నారు. బ్రిటీష్ వారిని ఎదురిస్తూ ఎన్నో సార్లు జైలు శిక్ష అనుభవిస్తూ, దేశం కోసం పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతులచ్చన్న అని, ఆయన రాజకీయ జీవితం విశాఖ నుంచే ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించినప్పటికీ విశాఖపట్నం, విజయవాడ వంటి పట్టణాల్లో శ్రీశయన కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వక పోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బంటుపిల్లి కృష్ణగిరి జోగారావు, తోట హరికృష్ణ, జలుమూరి చిట్టిబాబు, మడ్డి ప్రసాద్, దొంపక భాస్కరరావు, శ్రీశయన యువత తదితరులు పాల్గొన్నారు.